క్లుప్తంగా

పోషకాహారంతో రక్తహీనత దూరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి పేర్కొన్నారు. కొండపల్లి ఎస్టీ కాలనీలోని 151వ అంగన్‌వాడీ కేంద్రలో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు సోమవారం అవగాహన కల్పించారు. చిన్నారులకు ఎత్తు, బరువు చూశారు.

పింఛన్ల పంపిణీ

చంద్రగూడెం(మైలవరం): మైలవరం మండలం చంద్రగూడెం గ్రామ సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ శ్రీనివాసరావు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛన్లు తీసుకోవాలంటే ఉదయం నుంచే గ్రామ పంచాయతీల వద్ద వేచి చూడాల్సి వచ్చేదని, అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టడంతో తెల్లవారు జామునుంచే వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని పేర్కొన్నారు.

ఆలయానికి వెండిగంగాళం వితరణ



తిరువూరు: స్థానిక శ్రీవేంకటాచలస్వామి దేవస్థానానికి వెండి గంగాళాన్ని ఒక దాత సోమవారం వితరణ ఇచ్చారు. సుమారు రూ.10వేల విలువైన గంగాళాన్ని ఆలయంలో స్వామివారి తీర్థప్రసాదాల నిమిత్తం ఆలయ కమిటీ చైర్మన్ ముత్తారావుకు వ్యాపార ప్రముఖుడు పాలెపు నరసింహారావు అందజేశారు. శ్రీరంగనాయకస్వామి దేవస్థానం, శ్రీకోదండ రామాలయాలలో కూడా నరసింహారావు వెండిగంగాళాలు వితరణ ఇచ్చినట్లు ఆలయ ధర్మకర్తలు దారా రంగారావు, సోమవరపు సత్యనారాయణ తెలిపారు.

ఇంజినీరింగ్‌తో తక్షణ ఉపాధి

తిరువూరు: ఇంజినీరింగ్ కోర్సు చేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అపార ఉపాధి అవకాశాలున్నాయని తిరువూరు శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు అన్నారు. కళాశాలలో ప్రథమ సంవత్సరం బీటెక్ లో చేరిన విద్యార్థులకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న సామాజిక పరిస్థితులు, సాంకేతిక పురోగతితో పాటు ఇంజినీరింగ్ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఏకాగ్రత ఉంటేనే ఇంజినీరింగ్‌లో రాణించగలుగుతారన్నారు. కరస్పాండెంటు పీ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆర్ నాగేంద్రబాబు, అధ్యాపకులు కిషోర్, మోజెస్ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు.

అంకిత భావంతో ఇంగ్లిష్ బోధన



ఇబ్రహీంపట్నం: మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు మల్లెల తేజోమయి విద్యార్థులకు అంకిత భావంతో విద్యాబోధన చేస్తున్నారు. టెస్ట్‌క్లాస్ ఇంగ్లిష్ బోధనలో విద్యార్థులకు అనేక రకాల మెలకువలు నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో మెరికల్లాంటి విద్యార్థులను తయారు చేస్తున్నారు. ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ సంస్థ నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎన్టీఆర్ జిల్లా నుంచి అవార్డుకు ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నుంచి అవార్డు అందుకోనున్నారు.

చనుబండలో వైద్య శిబిరం



చాట్రాయి: మండలంలోని చనుబండలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో దోమల మందు పిచికారీ చేసి, ఇంటింటికి ఫీవర్ సర్వే చేశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి జ్వరం, బీపీ, షుగర్ ఒళ్లు నొప్పులు ఉన్న రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు సమాజసేవలో భాగస్వాములు కావాలని సినీ దర్శకుడు, సీనియర్ గాయకుడు ఒమ్మి రమాశంకర్ అన్నారు. మురుగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం ఉప్పొంగెలే గోదావరి పేరుతో సినీ సంగీత విభావరి, పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రమాశంకర్ మాట్లాడుతూ సమాజాన్ని దేవాలయంగా భావించి అన్నార్తులకు సేవలను అందించాలని సూచించారు.

ఏటి కాలువతో పంటలకు పుష్కలంగా నీరు

ఎమ్మెల్యే
వెంకట ప్రతాప్ అప్పారావు



గుళ్లపూడిలో ఏటికాలువకు నీరు విడుదల చేసి, పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

గుళ్లపూడి (ముసునూరు): తమ్మిలేరు నీటి మళ్లింపు ఏటి కాలువ ద్వారా నాలుగు గ్రామాల పంటలకు పుష్కలంగా నీరు అందుతుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. తమ్మిలేరు నీటిని గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం గ్రామాలకు అందించే ఏటి కాలువకు సోమవారం సాయంత్రం ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటి సంఘ పెద్దలు, స్థానిక రైతులతో కలసి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువ పూడిపోవడంతో పూడిక, తుంగ, తూడు, ముళ్ల కంపలను తీయించి, ఆయకట్టుకు నీరందించే ప్రక్రియను వేగంగా పూర్తి చేయించామన్నారు. ఈ కాలువ ద్వారా నాలుగు గ్రామాల్లోని 1,500 ఎకరాల ఆయకట్టుకు అధికంగా నీరు లభించి, సమృద్ధిగా పంటలు పండుతాయన్నారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో మిర్చి పంటకు సైతం నీరు లభ్యమవుతుందని పేర్కొన్నారు. రైతులందరూ ఎమ్మెల్యేను సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, గ్రామ సర్పంచ్ శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచ్ వల్లీ పద్మజ రాంబాబు, వలసపల్లి, లోపూడి సర్పంచ్‌లు దామోదర్, కృష్ణ, నీటి సంఘ పెద్దలు వలసపల్లి రాముడు, మండల పార్టీ అధ్యక్షుడు నాగ వల్లేశ్వరరావు, సభ్యుడు సురేష్, గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.10.50 లక్షల వితరణ



గొల్లపల్లిలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న విజయగోపాల్

నూజివీడు: గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావడం వల్ల గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని గొల్లపల్లి సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో గోగినేని భానుమతి చారిటబుల్ ట్రస్టు ఫౌండర్, చైర్మన్ గోగినేని విజయగోపాల్ గ్రామంలోని జెండా చెట్టు సెంటర్ నుంచి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.10.50 లక్షలను విరాళంగా అందజేయగా ఆ నిధులతో నిర్మించనున్న తారురోడ్డు నిర్మాణానికి సోమవారం సర్పంచ్‌కు సంబంధిత ధ్రువపత్రాన్ని అందజేసి అనంతరం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి అవిర్నేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు ఎస్‌టీపీ వెంకటేశ్వర్లు, గోగినేని శ్రీనివాస కుమారఅప్పారావు, ఎంపీటీసీ సభ్యులు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటుకలూరి రామయ్య, చవుటపల్లి కిషోర్, తటుకూలు రంగారావు, మేరుగ లెనిన్, చల్లారి రాఘవ పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీలను వెంటనే పరిష్కరించాలి

సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్



నూజివీడులో అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్ష్‌రాజేంద్రన్



గంపలగూడెంలో అర్జీలు తీసుకుంటున్న అధికారులు



తిరువూరులో స్పందనలో అర్జీలు సమర్పిస్తున్న ఆంజనేయపురం గ్రామస్తులు

నూజివీడు: స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ ఆదేశించారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి, డివిజన్‌లోని పలు మండలాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో వ్యయప్రయాసలకోర్చి ప్రజలు స్పందనలో అర్జీలను అందజేస్తున్నారన్నారు. అధికారులు గడువులోగా అర్జీలను పరిష్కరించినట్లయితే ప్రజల్లో స్పందన కార్యక్రమంపై నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని, అర్జీల పరిష్కారంలో అధికారులు ఏమాత్రం అలసత్వం వహించొద్దన్నారు. ఒకవేళ పరిష్కరించడానికి వీలుకాకపోతే కారణాన్ని సంబంధిత అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. స్పందనలో మొత్తం 16 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్ పాల్గొన్నారు.

‘స్పందన’లో నాలుగు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో నాలుగు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి

తిరువూరు: మండలంలోని ఆంజనేయపురంలో తాము సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు, సీలింగ్ భూములకు పట్టాలివ్వాలని సాగుదారులు సోమవారం తిరువూరు తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించారు. సొంత భూమి లేని పేదలమైన తాము ఎంతోకాలంగా ఈ భూములను సాగుచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, అనుభవ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. ఆంజనేయపురం సర్పంచ్ మామిడి కుటుంబరావు ఆధ్వర్యంలో సాగుదారులు స్పందనలో అర్జీ సమర్పించారు.

రేపు వాహనాల వేలం

జి.కొండూరు: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్సైజ్, సారా కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాటను ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్సై ధర్మరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఈఎస్ ఆధ్వర్యంలో జి.కొండూరు పోలీసుస్టేషన్‌లో నిర్వహించనున్న ఈ వేలంపాటలో 26 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోకు సంబంధించి వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.500 ముందుగా చెల్లించి బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు పోలీసుస్టేషన్ వద్దకు రావాలని తెలిపారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: గంపలగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్, సారాదాడులకు సంబంధించి నమోదైన కేసుల్లో సీజ్ చేయబడిన 51 బైక్‌లను ఈ నెల ఆరో తేదీన బహిరంగ వేలంపాట ద్వారా విక్రయిస్తున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం గంపలగూడెం పోలీస్‌స్టేషన్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి వేలంపాట కొనసాగుతుందని పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు ముందుగా రూ. 500 చెల్లించాలని తెలిపారు.

21 వాహనాల వేలం

మైలవరం: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కేసులలో సీజ్ చేసిన మొత్తం 21 వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన వారు ఇతర వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించలని తెలిపారు.

7 నుంచి ఆటల పోటీలు

చాట్రాయి: మండల స్థాయి ఆటల పోటీలు ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు మర్లపాలెం జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఎ.బక్కయ్య తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 7, 8 తేదీల్లో మర్లపాలెం, చిత్తపూరు హైస్కూల్లో ఈ ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 7న మర్లపాలెం హైస్కూల్లో అండర్-14 విభాగంలో బాలబాలికలకు బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, అండర్-17 విభాగంలో బాల బాలికలకు బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్,షెటిల్, టెన్నికాయిట్, 8న చిత్తపూరు హైస్కూల్లో అండర్-14 విభాగం బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, అండర్-17 విభాగం బాలబాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకునిరావాలని ఆయన కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ



పాతరావిచర్లలో ఫాగింగ్ చేయిస్తున్న వైద్య సిబ్బంది

నూజివీడు: మండలంలోని పాతరావిచర్లలో దోమల నివారణకు సర్పంచ్ బసవరాజు అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గ్రామంలో ఫాగింగ్ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.యలమంద ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు అన్ని అంతర్గత రోడ్లలో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పీ సారథి, సెక్రటరీ సునంద, ఏఎన్‌ఎం సుష్మ పాల్గొన్నారు.

పోలీసులు అదుపులో రేషన్ బియ్యం లారీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

మైలవరం: మైలవరంలో ఆదివారం అర్ధ రాత్రి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అశోక్ లేల్యాండ్ లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు నిఘా వేసి లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యం అక్రమంగా తరలించి వ్యాపారం చేసే రామచంద్రరావు పలుమార్లు విస్సన్నపేట, ఏలూరు, చాట్రాయిలో వారి లారీలను పోలీసులు సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం అతని అనుచరుడు ఈలప్రోలుకు చెందిన నిఖిల్‌గా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివక్షతకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేయబట్టే ప్రజల్లో విస్తృతంగా తిరుగుతున్నామని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇప్పటి వరకు 70 రోజుల పాటు, 24 సచివాలయాల పరిధిలోని 29,738 కుటుంబాలను సందర్శించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నామని పేర్కొన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో మరో రూ.20లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. డిసెంబర్ నాటికి నియోజకవర్గంలో దాదాపుగా అన్ని కుటుంబాలను సందర్శించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నరుకుళ్లపాడు, చెరువుమాధవరం, పుల్లూరు-2, కాచవరం, కుదప, మైలవరం-2, కట్టుబడిపాలెం, దాములూరు, గడ్డమణుగు, ఇబ్రహీంపట్నం-1, అన్నేరావుపేట, రుద్రవరం, చంద్రాల, కూనపురాజపర్వ-2, మద్దులపర్వ, కవులూరు-1,2లు, కొటికలపూడి, తుమ్మలపాలెం, మైలవరం-4, మైలవరం-1, మైలవరం-5, మైలవరం-3, తోలుకోడు సచివాలయాల పరిధిలో గడప గడపకు కార్యక్రమం ముగిసిందనట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసన



తహసీల్దారు శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మైలవరం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసన వ్యక్తం చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మైలవరం తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీలకు ప్రజా సొమ్ము ధారాదత్తం చేస్తోందని, వారికి ఇచ్చిన సబ్సిడీని ప్రజలపై పన్నుల రూపంలో వసూలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు తెలిపారు. తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు ఎం.శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆర్.రమేష్‌బాబు, నాయకులు సీహెచ్ సుధాకర్, రావుల సుబ్బారావు, ఇసాక్, నాగేశ్వరరావు, దేవేంద్రనాథ్, వెంకట రెడ్డి, సుబ్బారావు ధనలక్ష్మి, వీరమ్మ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు అజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పలు ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): కండ్రిక కాలనీకి చెందిన మహిళ కనిపించడంలేదని నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కండ్రిక కాలనీ వాటర్ ట్యాంక్ వద్ద భర్త నాగార్జున, అత్తతో ఉంటున్న తనుకుల నాగజ్యోతి ఈ నెల 3వ తేదీన పుట్టింటికని చెప్పి బంటుమిల్లి వెళ్లింది. భర్త ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. నాగజ్యోతి అన్నయ్యను విచారించగా ఇక్కడకు రాలేదని చెప్పాడు. అత్త నాగమల్లేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మూడేళ్ల కుమారుడితో తల్లి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మూడేళ్ల కుమారుడితో సహా తల్లి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...విద్యాధరపురం సితార కన్వెన్షన్ సెంటర్‌కు చెందిన షేక్ బాజీ నాలుగేళ్ల క్రితం అనకాపల్లికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారికి బాబు పుట్టాడు. పుట్టుకతోనే బాబుకు వెన్నెముక సమస్య ఉండడంతో అతనిని వైద్యుల వద్ద చూపిస్తున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో బాజీ తన కుమారుడు గౌతంతో కలిసి తల్లిగారింటి వద్దనే ఉంటుంది. తన కుమారుడుని ఆసుపత్రిలో సరిగా చూపించడం లేదని ఈనెల 2వ తేదీ ఉదయం బాజీ పుట్టింటి నుంచి వెళ్లిపోయింది. దీనిపై బాజీ తల్లి షేక్ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభించిన కోస్టల్ బ్యాంక్ సీజీఎం రామన్, బ్యాంక్ అధికారులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు తమ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత చైతన్య రథాన్ని ప్రారంభిస్తున్నామని కోస్టల్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) కేపీవీ. రామన్ తెలిపారు. గాయత్రీనగర్ ప్రధాన రహదారిలోని కోస్టల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం దగ్గర ఈ రథాన్ని రామన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చైతన్య రథం తమ బ్యాంకు శాఖల వద్ద, జనాల రద్దీ ప్రాంతాల్లో బ్యాంక్ పథకాలపై ప్రచార కార్యక్రమాలపై వివిధ రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. ప్రధానమంత్రి సురక్ష బీమాయోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తోందన్నారు. వార్షిక ప్రీమియం రూ.436 చెల్లిస్తే ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకంలో రూ.2 లక్షల వరకు జీవిత బీమా లభిస్తుందని చెప్పారు. బ్యాంక్ ఖాతాదారులకు ఎంతో సౌలభ్యంగా ఉండే డిజిటల్ బ్యాంకింగ్ లావాదేవీలను సురక్షితంగా, సులభంగా ఎలా నిర్వహించుకోవచ్చు అనే అంశాలపై కూడా ప్రచారం నిర్వహిస్తారన్నారు. మహిళలకు డిపాజిట్లపై అత్యధికంగా 8.5 శాతం వడ్డీని అందజేస్తున్నామని రామన్ చెప్పారు. కోస్టల్ బ్యాంక్ చీఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్ సురేష్ అగ్రావాలాతో పాటుగా బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోసం చేసిన భార్యాభర్తలపై కేసు

పెనమలూరు: కారు తీసుకుని మోసం చేసిన భార్యాభర్తలపై పెనమలూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు.. పెనమలూరు శ్రీహరి గార్డెన్స్‌లో నివసించే తెలప్రోలు శ్రీనివాస్‌కు విజయవాడ ఎస్ఆర్‌పేటలో జూమ్‌కార్ సేల్స్ ఇండ్ సర్వీసెస్ యజమాని అల్లూరి శరత్‌చంద్రవర్మ, అతని భార్య జ్యోత్స్నప్రియతో పరిచయం ఉంది. శ్రీనివాస్ గత ఏడాది తన పాతకారును వారి ద్వారా విక్రయించాడు. వారి వద్ద మరో కారు కొన్నాడు. కొన్న కారుపై ఫైనాన్స్ తీసుకున్నాడు. అయితే ఈ ఏడాది జనవరిలో అల్లూరి శరత్‌చంద్రవర్మ, జ్యోత్స్నప్రియ పెనమలూరు వచ్చి చిన్నపని ఉందని శ్రీనివాస్ కొన్న కారును తీసుకెళ్లారు. ఆ తరువాత కారు తీసుకొచ్చి అప్పగించలేదు. అప్పటి నుంచి భార్యాభర్తలు కనిపించకుండా తిరుగుతున్నారని, తన కారు తీసుకుని మోసం చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోసం చేసిన భార్యాభర్తలపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.